# 4. సమాజం

కాళ్ళుచెప్పులరగడమే కాకుండా కాళ్ళుకూడా నొప్పి పెట్టేలా స్నేహితులు, బంధువులు, పెళ్ళిళ్ళ పేరయ్యలిచ్చిన అడ్రస్ లన్నింటికి తిరిగితిరిగి వీరసించినా నిరాశచెందక, మళ్ళీ పెళ్ళికొడుకుల వేటకై బయలుదేరే ఆడపిల్లల తండ్రిలా విసుగుచెందకుండా చెట్టుదగ్గరికొచ్చాడు రాజేందర్ — చెట్టుపైకి చూసాడు — పైకొమ్మపై శవం భద్రంగావుంది — జేబులో వున్నదస్తీ తీసి ముఖం తుడుచుకున్నాడు - ప్యాంటు కొంచెం పైకి మడుచుకున్నాడు — మెల్లగా పాకుతూ చెట్టుపైకెక్కాడు — శవాన్ని తీసి భుజంపై వేసుకున్నాడు — చేతి పట్టుజారిపోకుండా జాగ్రత్త పడుతూ చెట్టుదిగాడు శ్మశానందిక్కు నడవసాగాడు — అతని ముఖంలో ఎన్ని అడ్డంకులెదురైనా ఈ కార్యాన్ని సాధించాలన్నపట్టుదల దృఢనిర్ణయం కొట్టొచ్చినట్లుగపడుతున్నాయి - రాజేందర్ కు మౌనభంగం కల్గించాలని శవంలోని భేతాళుడు

"ఓ యువకుడా! నిన్ను చూస్తుంటే నిరుద్యోగం, ఆర్థిక ఇబ్బంది ల్లాంటి సమస్యలతో సతమతమయ్యేవాడిలా కనబడటం లేదు... అయితే నువ్వేమాశించి నన్ను స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నావో నా ఊహకందకుండావుంది - నేననుకున్నది నిజమయితే నువ్వు నీ గురించి కాక ఈ సమాజం గూర్చి మథన పడుతున్నావు....అవునా-?" అన్నాడు

అవును-స్వార్థపూరితమైన ఈ సమాజానికి ఔషధం కనుగొంటానికి ప్రయత్నం చేస్తున్నాను ఈ నా ప్రయత్నంలో అన్ని రాజకీయపార్టీల గూర్చి తెలుసుకున్నాను - నా కలలు ఫలింపజేసే పక్షం ఒక్కటికూడా

నాకగుపళ్ళేదు - ప్రతిదాంట్లోనూ స్వార్థం ఎన్నోలో పాలు–కుమ్ములాటలు నాకేం చేయాలో తోచడంలేదు–అద్భుతశక్తుల సాధించయినా నాకార్యం నెరవేర్చుకోవాలని ప్రయత్నిస్తున్నాను., తనలో తానే గొణుక్కున్నాడు రాజేందర్ —

గంభీరంగా ముఖంపెట్టి శరీరంపైనుండి ముఖంపై నుండి ధారాపాతంగా కారుతున్న చెమటను లెక్కచేయకుండా గబగబా శ్మశానంకేసి నడుస్తున్నాడు....

తన ప్రశ్నకు సమాధానం రాకపోయేసరికి భేతాళుడు "నీ ముఖంలోని గంభీరతను, నీ నడకవేగాన్ని చూస్తుంటే నీ పట్టుదల యొక్క బలం అర్థమవుతుంది–నీలాంటి యువకుడు నన్ను స్వాధీనం చేసుకుంటే అంతకంటే కావాల్సిందేంలేదు- కాని నీకు స్వాధీనం కావాలన్నా నాషరతులు మామూలే—నీకు మార్గాయాసం కల్గకుండా ఉండడానికై ఓకథ చెబుతాను విను —" అని కథ చెప్పసాగాడు—

—బ్రహ్మయ్య కంసాలి — అతని రెండేళ్ళ పసివయసులోనే తల్లి చనిపోయింది — అతని అక్క లక్ష్మమ్మ అతన్ని పెంచింది— ఒళ్ళో కూర్చోబెట్టుకొని అన్నంముద్దలు తినిపించింది .... మోకాళ్ళపై పడుకోబెట్టుకొని ఉయ్యాలలూపింది- తలపై తమ్ముణ్నెత్తుకొని ఊరంతా తిప్పి ఆడించింది — జోకొట్టి జోలపాటలు పాడి నిద్రబుచ్చింది — లక్ష్మమ్మ బ్రహ్మయ్యకంటే ఆరేడేళ్ళ పెద్దదైనా అతనికి తల్లై, తల్లిలేని లోటు తీర్చింది ... తల్లికంటే ఎక్కువ చి పెద్దజేసింది — తన చేతుల్లో పెరిగిన తమ్మునిపై ఆమెకు అమితప్రేమ — వాత్సల్యం — లక్ష్మమ్మకు పెళ్ళయింది—ఊళ్ళోనే అత్తగారు

తమ్ముడికి పెళ్లయేంతవరకు తాన త్తగారింట్లోవున్నా వంటలాంటిది చేసిపోయేది—తర్వాత బ్రహ్మయ్యకు కూడా పెళ్ళయింది—ఈ లోగా అతని తండ్రి చనిపోయాడు— అక్కా, తమ్ముళ్ళు ఎవరి సంసారగొడవల్లో వాళ్ళు మునిగిపోయారు—ఇద్దరికి పిల్లలయ్యారు—లక్ష్మమ్మ భర్త కులవృత్తి కాకుండా వ్యవసాయంచేస్తూ జీవిస్తుంటాడు-బిడ్డకు అరతులం బంగారంతో చెవికమ్మలు చేయించాలనుకుంది లక్ష్మమ్మ — బంగారం తమ్ముడికిచ్చి చెయ్యమంది—— కానామె తమ్ముని కెదురుగానే కూర్చుంటుంది- రెండురోజులలాగే కూర్చుంది...మూడవరోజు పని పూర్తయ్యే రోజు — వచ్చి తమ్మునికెదురుగా కూర్చుని చేయమంది లక్ష్మమ్మ — పనిచేస్తూ తేపకోసారి అక్కడిక్కు చూస్తున్నాడు బ్రహ్మయ్య—ఆమె తమ్మున్నే గమనిస్తుంది—కుంపట్లోవేసి గొట్టంతో ఉఫ్ ఉఫ్మని ఊది దాన్ని పైకితీసి చల్లార్చాడు—

"వదినే చా తాగుదువురా...? కేకేసింది బ్రహ్మయ్య భార్య—

"పో అక్కాపో— చాతాగిరాపో—" అన్నాడు బ్రహ్మయ్య....

"ఇక్కడికే పట్టుకరా వదినే — '' లోపలకు వినబడేటట్టంది లక్ష్మమ్మ తమ్ముని దిక్కే పరీక్షగా చూస్తుంది—

"ఈ దయ్యమెక్కడ దాపురించిందిరా—" తనలో తాననుకుంటూ తన పని కానిస్తున్నాడు బ్రహ్మయ్య—

అటూ ఇటూ చూసాడు బ్రహ్మయ్య...లక్ష్మమ్మ టీ తాగుతుంది- బ్రహ్మయ్యనే చూస్తుంది _బంగారం ఇనుపకడ్డీపై పెట్టి దానిమీద వాడి మొలపెట్టి సుత్తితో బాదుతున్నాడు_మధ్య మధ్య కళ్ళద్దాల సందుల్లోంచి అక్కడిక్కు చూస్తున్నాడు_లక్ష్మమ్మ తమ్ముని పనినే నిశితంగా పరిశీ

లిస్తుంది—టక్ టక్ మని బంగారాన్ని కొడుతున్నాడు బ్రహ్మయ్య-'టక్' మని చిన్నచప్పుడు — బ్రిహ్మయ్య ముఖంలో వెలుగు — తమ్ముని ముఖంలో వెలుగును జూచిన లక్ష్మమ్మ తమ్ముడు చూస్తున్న దిక్కే దృష్టి సారించి చూసింది ఇద్దరి దృష్టి కొంచెం దూరంలో వాకిట్లో పందిరికి వేలాడుతున్న సొరకాయపై నిలిచింది-తమ్ముని ముఖంలో వెలుగెందుకో లక్ష్మమ్మకర్థమైంది ... మరో గంటలో పనిపూర్తిచేసి పొట్లంకట్టి అక్క చేతిలో పెట్టాడు బ్రహ్మయ్య — లక్ష్మమ్మ లేచి నిల్చొని వెళ్ళబోతూ "గీ అనిగెంకాయె మంచిగుంది—రాత్రికూర కైతది — " అని తెంపబోయింది — బ్రహ్మయ్య గబగబా వాకిట్లోకొచ్చి "అక్కా! గీ కాయె మంచిగలేదు—ఇగో గీ కాయె తీసుకో' పెద్దగుంది – అని పెద్దకాయను చూపించాడు–

"అది ముదిరిపోయింది – ఇదే లాతగుంది – "అని దాన్నే తెంపబోయింది – "అట్లాగే అక్కా, నీకు లాతగాయె గావన్నా? ఇగో గిది తెంపుకో'' అని అంతకంటే లేతకాయ చూపించాడు బ్రిహ్మయ్య "అది వద్దురతమ్మి – పురాగ ల్యాతగుంది – కసికెతోని పొట్టుగీకుతే కాయే తెగెటట్టుంది – అని మొదటిదాన్నే తెంపబోయింది లక్ష్మమ్మ –

" అద్దెంపకే అక్క దాన్ని ఇత్తునానికనుంచినం – నీకంతకంటే మంచిది సూపెడుతా పటు – " అని మరోకాయ చూపించాడు – ఇత్తనానికి గిదేం మంచిగుంటదిరా తమ్మి—? అగో గాముదిరి పెయిన పెద్ద కాయనుంచు—ఈ కాయే మంచిగుంది తెంపుకుంట ... " అందిలక్ష్మమ్మ

భర్తసైగ నర్థంచేసుకొని అరుగుదిగొచ్చింది అతని భార్య .... "వదినే! ఇగో — గీ లాతకాయ దెంపుకపో — ఇంట్లెన్ని టమాట

లున్నాయి తీసుకపో కావల్సింటే — అవ్వివ్వి కలిపి కూరండు....–''
అంది.

అయినా లక్ష్మమ్మ వినలేదు" తనకు ఆ కాయే కావాలని ఆమె, అది తప్పవేరే తెంపుకోమని బ్రహ్మయ్య పట్టుబట్టారు — చివరకు లక్ష్మమ్మ పట్టుదలే నెగ్గింది.

బ్రహ్మయ్య ముఖం వాడిపోయింది

'అక్కా! నీకండ్లు గుడ్లగూబకండ్లే..., తనలో తాననుకున్నాడు

"ఇంటి పుట్టుపూర్వోత్తరాలు మేనమామకు తెలిసినట్టు నాచేతుల్లో పెరిగిన నీ సంగతి నాకు తెలువదార తమ్మి...' అనుకుంది లక్ష్మమ్మ విజయగర్వంతో ఆ సొరకాయతో-వెళ్ళిపోయింది—

కథ చెప్పడం ముగించాడు భేతాళుడు ...

'లక్ష్మమ్మ నగలు చేయించేప్పుడు తమ్మున్ని దగ్గర్నే ఎందుకూర్చుంది....?

ఒకే సొరకాయ కోసం అక్కాతమ్ములిద్దరెందుకు పట్టుబట్టారు–? ఈ కథయొక్క అంతర్థానమేమిటి?

భేతాళుని ప్రశ్నలకు సమాధానాలు చెప్పసాగాడు రాజేందర్ – "డబ్బు ముందు అప్యాయానురాగాలకు, బంధుత్వ మమకారాలకు స్నేహశీలానికు మరిదేనికి చోటులేదు – అది ఈ సమాజ లక్షణం – ఈ విషయం లక్ష్మమ్మకు తెలుసు–బ్రహ్మయ్యకూడా తెలుసు–అందుకే లక్ష్మమ్మ తాను నగలు చేయించేటప్పుడు తన చేతుల్లో పెరిగిన తమ్మున్ని కూడా నమ్మక తనముందే చేయమని కూర్చుంది–ఎవరి చేతుల్లోనయితే పెరిగాడో ఆ అక్కయ్య నగల్లోంచి కూడా కొంతైనా బంగారం

క్రాజెయ్యాలని బ్రహ్మయ్య ఆలోచన– ఈ ఆలోచనా విధానం వ్యవస్థలో జీర్ణించుకొనుంది–

ఇక సోరకాయ గురించి – ఎలాగైనా బంగారం కాజెయ్యాలన్ని బ్రహ్మయ్య ఆలోచన – ఎదురుగా అక్క అతనికేంచేయాలో తోచలేదు, చివరికో ఉపాయం ఆలోచించాడు – మొలతో ప్రేమును సరిజేస్తున్నట్టు కొడుతూ తనకు గల వృత్తి నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆ బంగారం లోంచి ఓ చిన్న ముక్క చిల్లి సమీపంలోవున్న సోరకాయలోకి దూరేట్టు చేసాడు – బ్రహ్మయ్య – ఈ విషయం కనిపెట్టింది లక్ష్మమ్మ – అందుకే కక్కా తమ్ముళ్ళిద్దరూ ఆ సోరకాయ కొరకే పట్టుబట్టారు –

ఈ కథలోని సహజ సహజాల సంగతెలావున్న ఈ కథ ప్రస్తుత డబ్బు సమాజం యొక్క స్వరూప స్వభావాలను నగ్నంగా బహిర్గతం చేస్తుందది –

రాజేందర్‌కు మౌనభంగం కలుగగానే శవంతోసహా మాయమై చెట్టెక్కి కూర్చున్నాడు భేతాళుడు—

(జీవగడ్డ ఆగష్టు 1985.)